
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు
3
ఆదివారం 2 జూన్ 2024





ఖాదిరాబాద్‌లో ఫర్టిలైజర్‌షాప్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

వట్‌పల్లి, జూన్ 1 : రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి హెచ్చరించారు. వట్‌పల్లి మండలం ఖాదిరాబాద్‌లోని ఫర్టిలైజర్ షాపులు, జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మార్పీకే విత్తనాలను విక్రయించాలని, స్టాక్, ధరల పట్టిక బోర్డులు దుకాణాల ఎదుట ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జొన్నల కొనుగోలు కేంద్రంలో ఒకే కాంటాతో తూకం వేస్తే కొనుగోళ్లు ఎప్పటికి పూర్తవుతాయని నిర్వాహకులపై అసహనం వ్యక్తంచేశారు. ఆమె వెంట అందోలు ఆర్డీవో పాండు, స్థానిక ఏవో మహేష్ చౌహాన్, డిప్యూటీ తహసీల్దార్ శాంబిరెడ్డి, ఏఈవో ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



నార్సింగ్‌లో విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న మెదక్ కలెక్టర్

చేగుంట, జూన్ 1: మెదక్ జిల్లాలో జీలుగ, జనుము విత్తనాల కొరత లేదని కలెక్టర్ రాహుల్‌రాజు పేర్కొన్నారు. నార్సింగ్ మండల కేంద్రంలో విత్తన దుకాణాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెదక్ జిల్లాకు 6,400 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు వచ్చాయని, ఇప్పటి వరకు 5 వేల క్వింటాళ్ల పంపిణీ జరిగిందన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొరత లేకుండా విత్తనాలను సరఫరా చేస్తుందని పేర్కొన్నారు. విత్తనాలు లేవని సోషల్ మీడియాలో వచ్చే ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన పేర్కొన్నారు. అలాగే, ఆయన నార్సింగ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. పాఠశాలలు తెరుచుకునే లోపు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో చిన్నారెడ్డి, వ్యవసాయాధికారి యాదగిరి, ఎస్సై అహ్మద్ మొయినుద్దీన్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం : ఎస్పీ

సంగారెడ్డి క్రైం, జూన్ 1: దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి అమలులోకి వచ్చే కొత్త చట్టాలపై పోలీసుశాఖ సిబ్బందికి అవగాహన అవసరమని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. నూతన చట్టాలపై పోలీసుశాఖ సిబ్బందికి జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరై అవగాహన కల్పించారు. కొత్త చట్టాలపై పోలీసులందరికీ విడతలవారీగా శిక్షణ నిర్వహిస్తామని చెప్పారు. న్యాయాధికారి రాధాకృష్ణ చౌహాన్ మాట్లాడుతూ కొత్త చట్టాల్లో అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించి సరైన సెక్షన్ల కింద కేసు నమోదు చేయగలరని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, లాలూ నాయక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమానికి ఊపిరి

- సిద్దిపేట నుంచే మలిదశ పోరాటం
- 2001లో టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు
- సబ్బండ వర్గాల సంకల్ప దీక్షలు
- తెలంగాణ రాష్ట్రం సాకారమై పదేళ్లు
- దశాబ్ది వేడుకలకు సిద్ధమైన జిల్లా





సంగారెడ్డిలో ముస్తాబైన కలెక్టరేట్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 1: "సిద్దిపేట లేనిదే కేసీఆర్ లేడు.. కేసీఆర్ లేనిదే తెలంగాణ లేదు".. అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం పదే పదే ప్రస్తావిస్తుంటారు. సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్ 2001లో టీఆర్ఎస్ పార్టీని స్థాపించడంతో ఈ ప్రాంత ఉనికి నలుదిశలా వ్యాపించింది. ఇదే పార్టీ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా కేసీఆర్ పోటీచేసిన నాడు తెలుగు ప్రజలంతా ఉత్కంఠతో ఎదురుచూశారు. ఆ ఉప ఎన్నికనుంచి తెలంగాణ సాకారమయ్యేవరకు, అలాగే సిద్దిపేట సహా ఉమ్మడి జిల్లా ప్రజలు క్రియాశీలక పాత్ర పోషించారు. పోరాటాలకు పిలుపునిచ్చిన ప్రతీసారి ఊపిరిలూది జైకొట్టారు. కేసీఆర్ వెన్నంటే ఉంటూ ఉద్యమాన్ని హోరెత్తించిన హరీశ్‌రావు సైతం సిద్దిపేట పోరుబాటలో ముందునిలిచారు. ఆటపాటలతో కవి గాయకులు ధూందాం చాటారు. అన్ని వర్గాల ప్రజలు దీక్షాదక్షతతో నినదించారు. స్వరాష్ట్రం ఏర్పాటై నేటికి సరిగ్గా పదేళ్లు నిండిన సందర్భంగా ఉద్యమ సంగతులను మననం చేసుకుంటున్నారు.

> మలి దశ తెలంగాణ ఉద్యమానికి దశ, దిశను చూపిన నేల ఉమ్మడి మెదక్ జిల్లా అంటే అతిశయోక్తి కాదు.. తెలంగాణ ఉద్యమంలో మెదక్ జిల్లా కీలకపాత్ర పోషించింది. మలిదశ ఉద్యమంలో తెలంగాణ కోసం జరిపిన పోరాటంలో ఊరూవాడా ఒక్కటై కదిలింది.

కరువుకాటకాలు, ఆకలిచావులు, ఆత్మహత్యలు, వలసలకు ఈ ప్రాంతం పెట్టింది పేరుగా ఉండేది. సాగునీటికి, తాగునీటికి వర్షమే ఆధారమైన పరిస్థితులు. రవాణా వ్యవస్థ, విద్యావైద్యం, ఉపాధిలోనూ వెనుకబాటే. ఇలా ఎన్నో సమస్యలతో తల్లడిల్లిన ఈ ప్రాంతం నాడు ఉద్యమంలో.. ఆ తర్వాత అభివృద్ధిలోనూ ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఈ ప్రాంతవాసులుగా పదేళ్లపాటు ప్రభుత్వంలో కీలకంగా ఉన్న కేసీఆర్, హరీశ్‌రావు తమ పురిటి గడ్డకు ప్రాధాన్యతనిచ్చారు.

సిద్దిపేట.. పోరుబాట

2001లో సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్ తన పదవికి రాజీనామా చేసి టీఆర్ఎస్ పార్టీని స్థాపించడం రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనమైంది. ఆనాడు జరిగిన ఉప ఎన్నికలో సిద్దిపేట పేరు దేశమంతా మార్మోగింది. ఆ తర్వాత 2004 ఉప ఎన్నిక, 2008 ఉప ఎన్నిక, 2009, 2010 ఉప ఎన్నికలో హరీశ్‌రావుకు సిద్దిపేట ప్రజలు భారీ మెజారిటీ అందించి టీఆర్ఎస్ పార్టీని విజయతీరాలకు చేర్చారు. ఇక్కడ జరిగిన ఉద్యోగ గర్జనతో మరోసారి ఉద్యమం వేడెక్కింది. 2009లో సిద్దిపేటలోని అమరుల స్థూపం వద్ద కేసీఆర్ తలపెట్టిన ఆమరణ నిరాహారదీక్షను పోలీసులు భగ్నం చేయడంతో రాష్ట్రం అగ్నిగుండమైంది. ఆయన జైలులో, ఆసుపత్రిలో తన దీక్షను కొనసాగించడంతో డిసెంబరు 9న స్వరాష్ట్ర ప్రకటన వెల్లడైంది. సిద్దిపేట బస్టాండ్ ఆవరణలో 1500 రోజులపైన నిరాహారదీక్షలు చేపట్టారు. అన్నివర్గాల ప్రజలు, మహిళలు, యువత ఈ దీక్షల్లో పాల్గొని ఉద్యమానికి మద్దతు పలికారు.



నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని రావి ఆకుపై గీసిన రాష్ట్ర మ్యాప్, అమరవీరుల స్థూపం, పిడికిలి



విద్యుద్దీపాల కాంతులతో మెరిసిపోతున్న మెదక్ కలెక్టరేట్ కాంప్లెక్స్

అమరుల యాదిలో
- త్యాగాల ఫలితంగానే తెలంగాణ
- నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఎందరో ఆత్మార్పణం
- దశాబ్ది ఉత్సవాలవేళ స్మరించుకుందాం..

5 లో

ధూందాంకు ఆజ్యం

తెలంగాణ ధూందాం కార్యక్రమానికి ఆజ్యం పోసిన గడ్డ సిద్దిపేటనే. నలువైపులా ప్రజలను జాగృతం చేయడానికి ఊరూరా కళాకారులు తమ ఆటాపాటలతో ఆలోచింపజేశారు. దీనికి పాటలు రచించిన నందిని సిధారెడ్డి ఈ ప్రాంతం వారే. అలాగే ధూందాంకు నాయకత్వం వహించిన రసమయి బాలకిషన్ సిద్దిపేట రూరల్ మండలం రావురూకుల గ్రామస్థుడు. అదే విధంగా తన మాట, పాటతో యావత తెలంగాణ ప్రజల్లో చైతన్యాన్ని రగిల్చిన దేశపతి శ్రీనివాస్ సిద్దిపేట వాస్తవ్యులే. కేసీఆర్ పార్టీని స్థాపించిన క్షణం నుంచి తెలంగాణ వచ్చేదాకా తమ సాహిత్యం, గానంతో ఈ ప్రాంత కళాకారులు వెన్నంటే నిలిచారు. ఉద్యమ పాటలను ప్రజల్లోకి చొచ్చుకెళ్లేలా అహర్నిశలు శ్రమించారు. మంజీర రచయితల సంఘం ఆధ్వర్యంలోనూ అనేక కార్యక్రమాలు జరిగాయి.

మెదక్ దక్..దక్

ఆసక్తిని రేపుతున్న మెతుకుసీమ పోరు

- విజయంపై ముగ్గురు అభ్యర్థుల ధీమా
- అంతుపట్టని పోలింగ్ సరళి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూన్ 1: మెదక్ లోక్‌సభ ఎన్నికల ఫలితం ఎలా ఉండబోతున్నదనే ఆసక్తిగా మారింది. విజయంపై మూడు పార్టీలూ ధీమాతో ఉండగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌కు ఈ ఎన్నిక ప్రతిష్ఠాత్మకం కావడంతో ఉత్కంఠ నెలకొన్నది.

బీఆర్ఎస్‌కు అత్యంత కీలకం

మెదక్‌లో గత ఐదు ఎన్నికల్లోనూ విజయం సాధించిన బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నిక అత్యంత కీలకంగా మారింది. ఆరోగ్యం సహకరించకున్నా ఆ పార్టీ అధినేత కేసీఆర్ రోడ్‌షోలు చేపట్టారు. మెదక్ లోక్‌సభ పరిధిలోనే అత్యధికంగా ఐదు సభల్లో కేసీఆర్ పాల్గొన్నారు. వెంకట్రామా రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసేనాటి నుండి ఎన్నిక య్యేదాకా మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నీతానై ప్రచారం చేశారు. వెంకట్రామారెడ్డి సైతం రూ. 100 కోట్ల విద్యానిధితోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను తన సొంత నిధులతో అమలు చేస్తానని హామీ ఇచ్చారు. పోలింగ్ సరళిలోనూ తమకు అనుకూల వాతావరణం కనిపించిందని ధీమాతో ఉన్నారు.

రసవత్తరంగా ఎగ్జిట్‌పోల్స్

> శనివారం సాయంత్రం పలు సర్వే సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు మరింత ఉత్కంఠను రేపుతున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఒకే ఒక్క స్థానంలో విజయం సాధిస్తుందని వెల్లడించాయి. అది కూడా మెదక్ లోకసభ గురించే ప్రస్తావించాయి. ఇక మరికొన్ని ఏజెన్సీలు మాత్రం పోలింగ్ సరళి ఆధారంగా బీజేపీకే విజయావకాశాలు ఉన్నాయని స్పష్టం చేస్తున్నాయి. ఒకట్రెండు ఏజెన్సీలు కాంగ్రెస్ కూడా గెలవొచ్చని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచాయి.

కాంగ్రెస్‌కూ ప్రతిష్ఠాత్మకమే..

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ కూడా మెదక్ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. 1980లో ఇందిరాగాంధీ ఇదే సెగ్మెంటు నుంచి ఎంపీగా విజయం సాధించి ప్రధాని సీట్లో కూర్చున్నారు. ఇక్కడ 19 సార్లు ఎన్నిక జరిగితే సగం దఫాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలిచారు. అందుకే ముఖ్యమంత్రి రేవంతరెడ్డి ప్రత్యేక దృష్టిసారించి ముదిరాజ్ కులస్థుడైన నీలం మధును బరిలో దింపారు. మెదక్, పటాన్‌చెరు, సిద్దిపేటలో తాను, నర్సాపూర్‌లో రాహుల్‌గాంధీ సభలు, రోడ్‌షోలు నిర్వహించారు.

బీజేపీ గురి..

గత పార్లమెంటు ఎన్నికలతో పోల్చితే ఈసారి బీజేపీ పార్టీ మెదక్ సీటుపై గురిపెట్టిందనే చెప్పాలి. గత ఎన్నికల్లో పోటీచేసిన అనుభవం ఉన్న మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుకే మరోసారి అవకాశం ఇచ్చారు. ఆయన నామినేషన్ కార్యక్రమానికి గోవా సీఎం ప్రమోద్ సావంత హాజరయ్యారు. సిద్దిపేటలో జరిగిన విశాల జనసభకు ఆ పార్టీ అగ్రనేత అమితషా వచ్చారు. మెదక్ జిల్లా అల్లాదుర్గంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు.



నీలం మధు వెంకట్రామారెడ్డి రఘునందన్

బెట్టింగ్‌ల జోరు

> తెలుగు రాష్ట్రాల్లోని 42 ఎంపీ స్థానాలు ఉన్నాయి. తాజా ఎన్నికల్లో హాట్ స్థానాల జాబితాలో మెదక్ ముందువరుసలో నిలిచింది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ గెలిచేస్థానాల్లో తొలి ప్రాధాన్యతగా మెదక్ పేరే చెబుతున్నారు. ఇక్కడ గెలవకుంటే ఇంకెక్కడ కూడా గెలిచే పరిస్థితి లేదంటున్నారు. ఈ నేపథ్యంలో మెదక్ పార్లమెంటు పరిధిలో, తెలంగాణతోపాటు ఏపీలోనూ ఈ సీటు గురించి విస్తృతంగా చర్చిస్తున్నారు. ఇక్కడి గెలుపోటములపై బెట్టింగ్‌లు పెడుతున్నారు. ఏపీకి చెందినవారు స్థానికులకు ఫోన్లు చేసి విజయావకాశాలపై ఆరాతీస్తున్నారు. జహీరాబాద్‌లో ఫలితాలపై జోరుగా బెట్టింగ్ నడుస్తున్నది. సురేశ్‌షెట్కార్, బీబీపాటిల్‌లో ఎవరు గెలుస్తారనే దానిపైనే ప్రధానంగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. బాన్సువాడ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఈ బెట్టింగులు ఎక్కువగా జరుగుతున్నట్టు తెలిసింది. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ అభ్యర్థి గెలుస్తారంటూ రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు బెట్టింగులు కడుతున్నారని తెలిసింది.

జహీరా'బాద్‌షా' ఎవరో?

- కాంగ్రెస్, బీజేపీల మధ్య హోరాహోరీ
- గెలుపుపై ఎవరి ధీమా వారిది

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూన్ 1 : జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎవరు గెలుస్తారోనని చర్చ రాజకీయవర్గాలు, ప్రజల్లో జరుగుతున్నది. ఈ నియోజకవర్గం నుంచి 19 మంది అభ్యర్థులు బరిలో నిలిచినా.. ప్రధాన పోటీ మాత్రం కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే సాగింది. ఈ నెల 4న పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు జరగనుంది.

బీజేపీకి సహకారం..

ఎన్నికలకు వారం రోజుల ముందు వరకు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య త్రిముఖ పోటీ అన్నట్టు కనిపించినా, ఆ తరువాత పరిస్థితి మారిపోయింది. అయిష్టంగానే బరిలోకి దిగిన బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ ఆర్థిక ఇబ్బందులతో ప్రచారం, పోల్ మేనేజ్‌మెంట్‌లో వెనకబడిపోయారన్న ప్రచారం ఆ పార్టీ వర్గాల్లోనే నెలకొన్నది. దీనికి తోడు మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన మాజీ మంత్రి టి.హరీశ్‌రావు.. జహీరాబాద్ నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి విజయం కోసం చొరవచూపించ లేకపోయారన్న అభిప్రాయం ఆ పార్టీ వర్గాల్లోనే వ్యక్తమైంది. దీంతో చేసేదేమీ లేక పోలింగ్‌కు రెండు రోజుల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్‌కు అనుకూలంగా వ్యవహరించారని ప్రచారంలోకి వచ్చింది. దీంతో, నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ బీబీపాటిల్ మధ్య పోరు సాగిందని చెబుతున్నారు.



సురేశ్‌షెట్కార్ అనిల్‌కుమార్ బీబీపాటిల్

6 నుంచి సహకార సంఘాల ఎన్నికలు

సంగారెడ్డి రూరల్/మెదక్ అర్బన్, జూన్ 1 : రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఆదేశాల మేరకు ఈనెల 6 నుంచి 28 లోపు జిల్లాల్లోని సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్లు అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లాలోని 68 ప్రాథమిక మత్స్య సహకార సంఘాలకు, ఒక గొర్రెల, ఒక కల్లుగీతా సహకార సంఘానికి ఎన్నికలు జరగనున్నట్లు జిల్లా సహకార సంఘాల అధికారిణి కరుణ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఒక హౌసింగ్, ఒక ఎల్‌సీసీఎస్‌కు ఎన్నికలను నిర్వహించనున్నట్లు జిల్లా సహకార అధికారి శ్రీధర్ తెలిపారు. మొత్తం రెండు సంఘాల ప్రతిపాదనలు వచ్చాయని ఎన్నికల షెడ్యూల్ ప్రకారం 28లోపు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివిధ సహకార సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, పాలకవర్గ సభ్యులు వారి పదవీ కాలం ముగిసే గడువుకు ముందు రెండు నెలల్లోగా ఎన్నికల ప్రతిపాదనలు నిర్ణీత ఫార్మెట్‌లో సభ్యుల ఫొటోలతో పాటు, ఎన్నికల ఫీజు డీడీ రూపంలో తీసి తమ కార్యాలయానికి పంపాలని సూచించారు.

కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాకే..
తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు ఉంది

- గడచిన దశాబ్దం.. ఓ విషాదం: హరగోపాల్
- గత సర్కారు సాగును పట్టించుకోలేదు: కోదండరాం

రాజేంద్రనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే తెలంగాణ రాష్ట్రం వచ్చినట్లు అనిపిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాష్ట్రంలో గత దశాబ్దం ఒక విషాదంగా మిగిలిపోయిందన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం(పీజేటీఎస్ఏయూ) తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం(టాసా), వర్సిటీ బోధనేతర సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరగోపాల్ మాట్లాడారు. ఈ ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ కార్యదర్శులకు విశ్వవిద్యాలయాల బాధ్యతలను అప్పగిస్తే వారేం చేయగలుగుతారని ప్రశ్నించారు. వ్యవసాయ పరంగా తెలంగాణ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నా గత ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయలేదని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. తెలంగాణకు విత్తన భాండాగారం అనే పేరున్నప్పటికీ సన్న, చిన్న కారు రైతులకు మేలు చేసేలా గత ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చర్యలు, సంప్రదింపులకు తలుపులు తెరవడం హర్షణీయమని అన్నారు.

ఆ పట్టణాల పేర్లు కూడా మార్చాలి

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయంటూ రాష్ట్ర ప్రభుత్వ లోగోను మార్చిన రేవంత్ సర్కార్ అవే ఆనవాళ్లతో కొనసాగుతున్న కొన్ని పట్టణాలు, జిల్లాల పేర్లు కూడా మార్చాలని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ పేరును ఎదులాపురంగా, నిజామాబాద్‌ను ఇందూరుగా, జహీరాబాద్‌ను పెద్దెక్కిలిగా, కరీంనగర్‌ను ఎలగందలగా, సికింద్రాబాద్‌ను లష్కర్ లేదా ఉల్వులుగా, మహబూబ్‌నగర్‌ను పాలమూరుగా, మహబూబాబాద్ పేరును మానుకోటగా మార్చి తెలంగాణ సంస్కృతిక పునరుజ్జీవనానికి బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త లోగోలో అమరవీరుల స్థూపం పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో ప్రాణాలర్పించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, వారి తల్లి, తండ్రి లేదా భార్యకు ప్రతినెలా రూ. 25 వేల అమరవీరుల గౌరవ పెన్షన్, ఇళ్ల స్థలాలు అందజేస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాగేంద్రరావు పదవీ కాలాన్ని పొడిగించొద్దు

- నల్ల బ్యాడ్జీలతో నీటి పారుదల ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ(ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్) బి.నాగేంద్రరావు పదవీ కాలాన్ని ఆర్నెళ్ల పాటు పొడిగిస్తూ వెలువరించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు, అధికారులు నిరసన తెలిపారు. శనివారం వీరంతా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పదవీ విరమణ చేసిన వారిని సలహాదారులుగా, ఓఎస్డీలుగా నియమించుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని.. కేడర్ పోస్టుల్లో నియమించడం వల్ల సర్వీసులో ఉన్న ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని, పదోన్నతుల ప్రక్రియకు విఘాతం కలుగుతుందని ఉద్యోగులు మండిపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఎంవో ఈ మెయిల్‌కు వినతి పత్రాలను పంపించారు. ఈ నెల 7 నుంచి ఈఎన్‌సీ సర్వీసు పొడిగింపుపై నిరసనలు ముమ్మరం చేయాలని సంఘాలు నిర్ణయించాయి. మరోవైపు పదవీ విరమణ చేసిన వారి సర్వీసును పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుతాన్ని కోరింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, చక్రధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌లు సీఎంకు వినతి పత్రం అందించారు.

ఏసీబీ దర్యాప్తు.. మరింత లోతుగా!

గొర్రెల డబ్బులు పంచుకున్నది అధికారులు, ప్రైవేటు వ్యక్తులేనా? రాజకీయ నేతల ప్రమేయం ఉందా?

- 700కోట్ల అక్రమాలపై త్వరలో నివేదిక
- రాంచందర్, కల్యాణ్ కస్టడీకి కోర్టులో పిటిషన్ వేయాలని ఏసీబీ యోచన

హైదరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకంలో భారీగా అక్రమాలు జరిగిన విషయం వెలుగులోకి వస్తుండడంతో.. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) భావిస్తోంది. సుమారు రూ.4 వేల కోట్లు ఖర్చు చేసిన ఈ పథకంలో ప్రాథమిక దర్యాప్తులోనే రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. లోతుగా దర్యాప్తు జరిపితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని యోచిస్తోంది. ఈ మేరకు ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు, ఎవరెవరి ప్రమేయం ఎంతవరకు ఉంది అనే వివరాలతో ప్రభుత్వానికి త్వరలో ప్రాథమిక నివేదిక అందజేసి.. తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించి వేలాది మంది లబ్ధిదారులకు జీవాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే గొర్రెల పంపిణీకి సంబంధించిన బిల్లుల చెల్లింపులో అక్రమాలు జరిగాయంటూ ఆంధ్రప్రదేశ్ రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు తొలుత కేసు నమోదు చేశారు. ఆ తరువాత ప్రభుత్వ ఆదేశం మేరకు ఏసీబీ రంగంలోకి దిగింది. అయితే రూ.2.10 కోట్ల అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేపట్టగా.. ఏకంగా రూ.700కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలింది. ప్రైవేటు వ్యక్తులు, దళారులు, ప్రభుత్వ ఉద్యోగుల అరెస్టుతో మొదలై మాజీ మంత్రి ఓఎస్డీ, టీఎస్ఎల్‌డీఏ సీఈవోను అరెస్టు చేసేదాకా వెళ్లింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 12 మంది అరెస్ట్ కాగా.. శుక్రవారం అరెస్టయిన తెలంగాణ స్టేట్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ సీఈవో సబావత్ రాంచందర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాజీ ఓఎస్డీ జి.కల్యాణ్‌కుమార్‌లు కీలకంగా వ్యవహరించినట్లు ఏసీబీ భావిస్తోంది. వీరిని ప్రశ్నిస్తే మరిన్ని అక్రమాలు, మరికొందరి పేర్లు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు తేలడంతో.. పరిమిత అధికారం ఉన్న రాంచందర్, కల్యాణ్‌లే ఇదంతా చేశారా? లేక వారి వెనక ఎవరైనా రాజకీయ నాయకుల ప్రమేయం ఉందా? అనే కోణంలో విచారించాలని యోచిస్తున్నారు. ఇందుకోసం.. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న వీరిద్దరిని కోర్టు అనుమతితో తమ కస్టడీకి తీసుకునేందుకు ఏసీబీ ప్రత్యేక కోర్టులో వచ్చేవారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు వ్యక్తుల్లో మొహిదొద్దీన్, ఆయన కుమారుడిని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. పశుసంవర్ధక శాఖలో ఫైళ్ల మాయంపై కూడా ఆరా తీయనున్నట్లు సమాచారం.



కొచ్చి.. లబ్ధిదారులతో ఫొటోలు దిగి, ఒక్కొక్కరికి రూ.70 వేలు చేతిలో పెట్టి.. అదేరోజు సాయంత్రం గొర్రెలను తిరిగి తీసుకెళ్లారు.

మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేసినా..

2021 జనవరి 21న జగిత్యాల జిల్లాలో సాక్షాత్తూ అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేసిన యూనిట్లలో కూడా గోల్‌మాల్ జరిగింది. 21 గొర్రెలకు బదులుగా.. 13-16 గొర్రెలు మాత్రమే ఇచ్చి దోకా చేశారు. మొదటి విడతలో అప్పటి ప్రభుత్వం 3.50 లక్షల యూనిట్లు పంపిణీ చేయగా... అత్యధిక యూనిట్ల పంపిణీలో ఇదే తరహాలో దందా జరిగింది. ఈ గొర్రెల దందాలో కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు, రాష్ట్ర పశుసంవర్ధకశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, బ్రోకర్లు... భాగస్వాములైనట్లు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలోని గొల్ల కురుమలకు రూ.75 వేలు చేతిలో పెట్టి.. యూనిట్లు కాజేసిన సంఘటనలు, గొర్రెలతో లబ్ధిదారుల ఫొటోలు తీయించి, వాహనాల్లో తీసుకెళ్లి, రైతులతో అగ్రిమెంటు చేసుకొని, మళ్లీ అవే వాహనాల్లో తిరిగి జీవాలను తీసుకెళ్లిన ఉదంతాలు కోకొల్లలుగా జరిగాయి. 20 గొర్రెలు, ఒక పొట్టేలుకు బదులుగా... చిన్న పిల్లలు, నాణ్యతలేని గొర్రెలు, రోగాల బారిన పడిన జీవాలను కూడా రైతులకు అంటగట్టారు. గొర్రెల రీ- సైక్లింగ్ అక్రమ రవాణాపై అప్పట్లో కేసులు కూడా నమోదయ్యాయి. రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు చెందిన 24 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. కొందరు అధికారులను సస్పెండ్ చేశారు. మరికొందరిని ప్రొక్యూర్మెంట్ బాధ్యతల నుంచి తప్పించారు. అప్పుడు జరిగిన అక్రమాలన్నింటిపైనా ఇప్పుడు ఏసీబీ అధికారులు పూర్తి ఆధారాలతో దర్యాప్తు జరుపుతున్నారు.

కేసుల వివరాల సేకరణ..

గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీపై అప్పట్లో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసులు నమోదయ్యాయి. ఒక్కో యూనిట్‌లో నిర్దేశించిన జీవాల కంటే తక్కువగా ఇవ్వడం, ఇచ్చిన వెంటనే ఫొటోలు తీసుకుని వెనక్కి తీసుకెళ్లడం, ఇలా అనేక అక్రమాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వీటిలో.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామంలో 21 మందికి గొర్రెల యూనిట్లు మంజూరయ్యాయి. వీరిలో 11 మందికి 2021 ఏప్రిల్ 10న ఏపీలోని గుంటూరు జిల్లా మాచర్ల నుంచి 11 యూనిట్ల గొర్రెలు తీసుకొచ్చారు. గొర్రెల కొనుగోలు కోసం ఏపీకి వెళ్లిన అధికారులతో అక్కడి దళారీ ఒకరు రీ- సైక్లింగ్‌కు ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నాడు. బావుపేట శివారులో గొర్రెలను దించి.. ఒక్కో యూనిట్‌కు రూ.72,500 చొప్పున లబ్ధిదారులకు చెల్లించి.. అధికారుల ధ్రువీకరణ అనంతరం తిరిగి అదే వాహనంలో గొర్రెలను ఏపీకి తీసుకెళ్తుండగా హసన్‌పర్తి పోలీసులు అడ్డుకొని కేసు నమోదు చేశారు. ఇక జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన గొల్ల కురుమలకు ఏపీలోని ప్రకాశం జిల్లా ఒంగోలు, గుంటూరు జిల్లాలోని పిడుగురాళ్ల, వినుకొండ నుంచి గొర్రెలను తీసు

విధులకు ఆటంకం కలిగించిన వారిపై ఫిర్యాదు..

రూ.వందల కోట్ల అక్రమాల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాంచందర్‌ను ఆయన కార్యాలయంలో ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన సమయంలో హైడ్రామా చోటు చేసుకుంది. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన ఏసీబీ అధికారులకు సహకరించేందుకు రాంచందర్ నిరాకరించారు. చివరికి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఏసీబీ అధికారుల వెంట బయలుదేరారు. అయితే అదే సమయంలో కొందరు సిబ్బంది రాంచందర్‌కు అనుకూలంగా వ్యవహరిస్తూ ఏసీబీ అధికారుల విధులకు ఆటంకం కలిగించారు. దీంతో వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. అత్యంత కీలకమైన కేసు కావడంతో ఎక్కడ, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం లేకుండా, ప్రతిదీ పక్కాగా, చట్టప్రకారం ముందుకెళ్లాలని దర్యాప్తు అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉన్నందున.. ఈ తరహా ఇబ్బందులకు ఆస్కారం లేకుండా కూడా ఈ ఫిర్యాదు ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారు.

మమ్మల్నెందుకు పిలవలేదు!

- సీఎం రేవంత్‌కు బండి సంజయ్ ప్రశ్న
- ట్యాంపింగ్ వివాదంపై సీబీఐ విచారణ కోరాలంటూ సీఎంకు లేఖ



న్యూఢిల్లీ, హైదరాబాద్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల కోసం కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీని ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రం ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన బీజేపీ నేతలను ఎందుకు ఆహ్వానించలేదో చెప్పాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటు బిల్లుకు పూర్తిస్థాయిలో మద్దతునిచ్చిన పార్టీ బీజేపీ అని గుర్తు చేశారు. ఢిల్లీలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. బిల్లు ఆమోదం పొందే సమయంలో కేసీఆర్ సభలో లేరని, బిల్లుకు ఓటు కూడా వేయలేదని అన్నారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలను ఆపేందుకు బీజేపీ నేత సుష్మా స్వరాజ్ కృషి చేశారని సంజయ్ చెప్పారు. ఆనాటి ఆత్మహత్యలకు సోనియా, కాంగ్రెస్ పార్టీలే కారణమని ఆరోపించారు. గతంలో రేవంత్ కూడా సోనియాను బలిదేవత అన్నారని గుర్తు చేశారు. కేసీఆర్‌ను ఆహ్వానించడానికి ఉత్సాహం చూపిన రేవంత్ బీజేపీ నేతలను ఎందుకు విస్మరించారని ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనానికి కేసీఆర్ రహస్య ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రత నేపథ్యంలో దానిపై సీబీఐ విచారణ కోరాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా కేంద్రానికి లేఖ రాసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేసుతో తెలంగాణ ప్రతిష్ఠ మసకబారిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సంజయ్ శనివారం సీఎం రేవంత్‌కు లేఖ రాశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ పెద్దలు అధికార పార్టీ సహా ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను మంట కలిపారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ ప్రాత ఉందని వెలుగు చూసినా కనీసం నోటీసులు ఇవ్వకపోవడాన్ని చూస్తుంటే రాష్ట్ర దర్యాప్తు సంస్థల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

పోలింగ్ సరళిపై బీజేపీ నేతల సమీక్ష

లోక్‌సభ ఎన్నికలపై బీజేపీ ముఖ్యనేతలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ఇంచార్జి అభయ్ పాటిల్, సంస్థాగత రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీ కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఎస్.రాంచందర్‌రావుతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జులు, ఎంపీ అభ్యర్థులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై సమీక్షించారు. అభ్యర్థుల అభిప్రాయాలను, ప్రచారం సందర్భంగా పార్టీ శ్రేణుల పనితీరును అభయ్‌పాటిల్ అడిగి తెలుసుకున్నారు. ఈ నివేదికను జాతీయ నాయకత్వానికి నేడో, రేపో అందించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

అమరుల యాదిలో

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి పదేళ్లవుతున్నది. సంబురాలు అంబరాన్నంటుతున్నాయి. ఆ సంబురాల వెనక అనేక మంది ఆత్మబలిదానాలు, ఉద్యమాలు దాగి ఉన్నాయి. నాడు ఉమ్మడిగా ఉన్న మెదక్ జిల్లా నుంచి తెలంగాణ ఉద్యమంలో వేలమంది కుటుంబాలను వదిలి ఆందోళనల్లో పాల్గొన్నారు. ఎంతోమంది ఆత్మబలిదాలు చేశారు. నేడు తెలంగాణ ఆవిర్భవించిన దినం సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో తెలంగాణ అమరులను ఓసారి గుర్తు చేసుకుందాం.

భెల్ ఉద్యోగాల్లో అన్యాయంపై లక్ష్మణ్ ఆత్మార్పణ



జహీరాబాద్/పటాన్‌చెరు/రామచంద్రాపురం: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హోతీ బీ గ్రామానికి చెందిన భద్రన్న, గుండమ్మల మొదటిసంతానం సిరిసిగ లక్ష్మణ్‌యాదవ్(20) ఐటీఐ చేసి కేంద్ర ప్రభుత్వ సంస్థ బీహెచ్‌ఈఎల్‌లో అప్రెంటీస్ పూర్తి చేశాడు. ఆనాడు బీహెచ్‌ఈఎల్‌లో ఉద్యోగం కోసం నాలుగుసార్లు రాత పరీక్ష రాసి ఉత్తీర్ణుడయ్యాడు. నాలుగు సార్లు ఇంటర్వ్యూలు జరిగినప్పటికీ సీమాంధ్ర అధికారుల పెత్తనంతో వారికే ప్రాధాన్యమిచ్చారు. ఉద్యోగం రాదని మనస్థాపానికి గురైన లక్ష్మణ్‌యాదవ్ ప్రభుత్వాలను కదిలించేందుకు ఫిబ్రవరి 26, 2010న భెల్ పరిశ్రమ ప్రధాన గేటు ముందు ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని జై తెలంగాణ అని నినదీస్తూ నిప్పంటించుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు భెల్ ఉద్యోగ నియామకాలలో అవతవకలు, స్థానిక యువతకు జరుగుతున్న అన్యాయంపై లక్ష్మణ్ రాసిన 16పేజీల ఉత్తరం ప్రతి ఒక్కరిని కదిలించింది. దీంతో భెల్ కార్మికులతో పాటు అన్ని పార్టీల నాయకులు జాతీయ రహదారిని దిగ్బంధం చేశారు. భెల్ నియామకాల్లో పూర్తి పారదర్శకత పాటిస్తామని యాజమాన్యం దిగివచ్చి ప్రత్యేకంగా హామీ ఇచ్చింది. తెలంగాణ ప్రభుత్వం లక్ష్మణ్ కుటుంబానికి రూ.పదిలక్షల ఆర్థిక సహాయం, సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించింది. అయితే వారి కుటుంబం ఇంకా పేదరికంలో మగ్గుతూనే ఉన్నది.

మైసమ్మకు మొక్కుకుని బలిదానం



ఇషాంత్‌రెడ్డి

న్యాల్‌కల్: మలిదశ ఉద్యమ సమయంలో సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం బసంతాపూర్‌కు చెందిన ఇషాంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓయూలో ఉంటూ, వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చేసి ఉన్నత చదువుల కోసం సన్నద్ధమవుతున్నాడు. ఈ క్రమంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే ఉద్యోగం వస్తుందనే వాదన ఆయనలో బలంగా నాటుకుపోయింది. అప్పటి ఏపీసీసీ అధ్యక్షుడు ఓడిపోతే ఆత్మార్పణ చేసుకుంటానని ఓయూలోని మైసమ్మ తల్లికి మొక్కుకున్నాడు. ఆ మేరకు ఆయన సూసైడ్ నోట్ రాసి, మైసమ్మ ఆలయం వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన రాసిన సూసైడ్ నోట్‌లో అప్పటి కాంగ్రెస్, టీడీపీ నాయకులు తెలంగాణ ద్రోహులని పేర్కొన్నాడు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఇషాంత్‌రెడ్డి కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సాయం చేసింది. సోదరుడికి ఉద్యోగం కల్పించింది. అయితే తమ మరో కుమారుడి చదువుకు సరిపోను ఉద్యోగం ఇవ్వకపోవడంతో అతను చేరలేదని తల్లిదండ్రులు స్వరూప, ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఎలాంటి సహాయానికి నోచుకోని అమరుల కుటుంబాలను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

గిరిజన బిడ్డలైన తండ్రి, కొడుకుల ఆత్మహత్య

నారాయణఖేడ్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం చాప్టా.కె పరిధిలోని సీతారాంతండాకు చెందిన శ్యామానాయక్ ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు లక్ష్మణ్ సైతం తండ్రిబాటలోనే తెలంగాణ సాధన కోసం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా శ్యామానాయక్‌కు భార్య సోనిబాయి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉండగా ఒక కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇద్దరి కూతుళ్లకు పెళ్లిళ్లయ్యాయి. మరో కుమారుడు హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. శ్యామానాయక్ భార్య సోనిబాయి సైతం నారాయణఖేడ్ పట్టణంలో జరిగిన రోడ్డుప్రమాదంలో పదేళ్ల క్రితం మృతి చెందింది. ఆ కుటుంబం పేదరికంలోనే మగ్గుతుంది.

ఉద్యమ అడ్డాగా మాసాన్‌పల్లి చౌరస్తా

కల్హేర్: మలిదశ ఉద్యమంలో సంగారెడ్డి జిల్లాలోని కల్హేర్ మండలం ఎంతో కీలకంగా మారింది. 161వ జాతీయ రహదారిపై ఉన్న మండలంలోని మాసాన్‌పల్లి చౌరస్తా ఉద్యమానికి అడ్డాగా ఉండేది. రాస్తారోకోలు జోరుగా సాగేవి. ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడిన రోజుల్లో చారిత్రాత్మక మర్రి చెట్టును మాసాన్‌పల్లి చౌరస్తాలో రహదారిపైనే కూల్చి నిప్పు పెట్టడంతో రెండు రోజుల పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. తెలంగాణా ఏర్పాటు చేస్తామని ప్రకటించిన తర్వాత మళ్లీ శ్రీకృష్ణ కమిటీ వేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆ రోజు రాత్రి మాసాన్‌పల్లి చౌరస్తా రణరంగంగా మారింది. వివిధ రాష్ట్రాలకు చెందిన లారీలను తెలంగాణా ఉద్యమకారులు ధ్వంసం చేశారు. టైర్లు కాల్చి రహదారిని దిగ్బంధించారు. మండల పరిధిలోని బీబీపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, అప్పటి టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుండు మోహన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున యువకులు ఆందోళనలు, నిరసనల్లో నిత్యం పాలుపంచుకున్నారు. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకోగానే కల్హేర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేసి, తగులబెట్టారు. కొన్ని రోజుల తర్వాత ఎంపీపీ కార్యాలయంలోని ఈజీఎస్ శాఖకు చెందిన కంప్యూటర్లు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు.

గుమ్మడిదల మండలంలో ఇద్దరు..



సాయికుమార్



భాస్కర్‌గౌడ్

గుమ్మడిదల: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల గ్రామానికి చెందిన ఆకుల జయరాం, జానా బాయ్ దంపతుల కుమారుడు ఆకుల సాయికుమార్(24) తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. రాష్ట్ర ఏర్పాటు కాదని భావించి 2010 ఫిబ్రవరి 1న ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుమ్మడిదల మండలం మంబాపూర్‌కు చెందిన బాజా కృష్ణగౌడ్, లలిత దంపతుల కుమారుడు భాస్కర్‌గౌడ్(26) తెలంగాణ రాదని మనస్థాపానికి గురై రోజు 12-2-2013న మేడ్చల్ జిల్లా డబిల్‌పూర్ వద్ద రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేసి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించింది.

పురుగుల మందు తాగి..



సంతోష

రాయపోల్: సిద్దిపేట జిల్లా రాయపోల్‌కు చెందిన చింతకింది సంతోష రాష్ట్రం రాదేమోనన్న బెంగతో 2011 ఫిబ్రవరి 9న తెలంగాణ కోసం చనిపోతున్నానని లెటర్ రాసి పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమె కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల పరిహారం ఇచ్చింది. ఆమె సోదరుడికి గురుకులంలో అటెండర్ ఉద్యోగాన్ని కల్పించింది.

దీక్ష శిబిరం నుంచి వెళ్లి..



శంకర్

నారాయణఖేడ్: తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున కొనసాగుతున్న సమయంలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటకుచెందిన నోముల శంకర్ దీక్ష శిబిరం నుంచి వెళ్లి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్‌కు భార్య లక్ష్మి, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన అనంతరం ప్రభుత్వం శంకర్ కుమారుడు కిరణ్‌కు పశుసంవర్ధక శాఖలో ఉద్యోగం ఇవ్వడమే కాకుండా రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించారు.

చెరువులో దూకి..



పండరి

నారాయణఖేడ్: మండలంలోని సంజీవన్‌రావుపేటకు చెందిన సుంకె పండరి 2010లో ఆందోళన కార్యక్రమం నుంచి వెళ్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పండరికి భార్య శోభ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ప్రత్యేక తెలంగాణలో పండరి భార్య లక్ష్మికి సాంఘిక సంక్షేమ శాఖ గురుకులంలో ఉద్యోగం ఇచ్చారు. ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థిక సహాయం చేసింది.

ఆందోళన నుంచి ఇంటికి వెళ్లి..



కనకయ్య

మద్దూరు: సిద్దిపేట జిల్లా దూళిమిట్ట మండల కేంద్రానికి చెందిన నిరుపేదయిన కనకయ్యది నిరుపేద కుటుంబం. 2011లో గ్రామంలో నిర్వహించిన ఆందోళనలో పాల్గొని ఇంటికి వెళ్లిన కనకయ్య ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కనకయ్య సోదరుడు రమేష్‌కు మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారు.

ఉద్యమానికి ఊపిరి.. కొండపాక



శ్రీకాంత్

కొండపాక: తెలంగాణ ఉద్యమంలో సిద్దిపేట జిల్లా కొండపాక మండల ప్రజలు ముందు వరుసలో ఉన్నారు. మండలంలోని దుద్దెడ వద్ద రాజీవ్ రహదారిపై ఆందోళనలు ఉధృతంగా చేశారు. ఆందోళనలో భాగంగా కొండపాక నుంచి దుద్దెడ వరకు ఆగి ఉన్న సుమారు 62 బస్సుల అద్దాలు పగులకొట్టడం సంచలనం రేపింది. దుద్దెడకు చెందిన ఇద్దరు, కొండపాకకు చెందిన ఇద్దరు తెలంగాణ కోసం ఆత్మహత్యకు పాల్పడ్డారు. దుద్దెడకు చెందిన వునుగూరి శ్రీకాంత్ అనే విద్యార్థి కేసీఆర్ దీక్ష భంగం అయిందని కలత చెంది ఉద్యమానికి ఊపిరిగా నిలవాలని 2009 నవంబరు 30న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుద్దెడకు చెందిన ఆవునూరి సత్తయ్య బార్బర్ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. దుద్దెడ రాజీవ్ రహదారిపై ఆందోళనలో పాల్గొని ఇంటికి వెళ్లి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొండపాకలో ముద్దపురం రాజయ్య, కన్యబోయిన ఐలయ్య ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ నాలుగు కుటుంబాల సభ్యులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వడంతో పాటు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించింది.

చేయూత కోసం సౌజన్య కుటుంబం నిరీక్షణ



చేర్యాల: తెలంగాణ కోసమే తనువు చాలిస్తున్నానని ఆస్పత్రిలో న్యాయమూర్తి ముందు మరణ వాంగ్మూలం అందించినప్పటికీ ఆ కుటుంబాన్ని ఆదుకునే వారే లేకుండా పోయారు. సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కాలనీకి చెందిన తాడూరు యాదయ్య-కనకతారలకు ముగ్గురు కూతుళ్లు. ఒక కుమారుడు. బీద దళిత కుటుంబానికి చెందిన యాదయ్య కూలీపనులు చేస్తూ, కనకతార పారిశధ్య కార్మికురాలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. పెద్దకూతురు స్వప్న చాలా యేళ్లక్రితమే అనారోగ్యానికి గురై మరణించగా.. కుమారుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. చిన్నకూతురు తాడూరు సౌజన్య(14) 2010లో 9తరగతి చదువుతుండగా, ఉవ్వెత్తున సాగుతున్న తెలంగాణ ఉద్యమానికి ఆకర్షితురాలైంది. ప్రత్యేకరాష్ట్రం వస్తుందో రాదేమోనని బెంగతో మార్చి 3, 2010న ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, అక్కడ పోలీసు, న్యాయమూర్తుల సమక్షంలో తెలంగాణ కోసమే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డానని మరణ వాంగ్మూలం ఇచ్చింది. ఆ తర్వాత ఆరోగ్యం క్షీణించడంతో గంటల వ్యవధిలోనే కన్నుమూసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించి పదేళ్లవుతున్నా ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి ఎలాంటి సహాయం అందలేదు. రెవెన్యూ అధికారులు, జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా సహాయం అందకపోవడంతో తల్లి కనకతార పదేళ్లుగా పడరానిపాట్లు పడుతున్నది.



ప్రజాప్రతినిధులకు ఇచ్చిన వినతిపత్రాలు చూపుతున్న తల్లి కనకతార

మండపాన్ని నిర్మించి, తెలంగాణ తల్లిని నెలకొల్పి..



దౌల్తాబాద్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం

హత్నూర: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని దౌల్తాబాద్(కాసాల) చౌరస్తా మలిదశ ఉద్యమానికి ఊతమిచ్చింది. ప్రత్యేక రాష్ట్ర కాంక్షతో ఇక్కడి ప్రజలు ఉవ్వెత్తున లేచారు. దౌల్తాబాద్ చౌరస్తాలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై అప్పటి టీఆర్ఎస్ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి జనార్ధన్‌రెడ్డి సారథ్యంలో దాతలు, ఉద్యమకారుల సహకారంతో రూ.15లక్షలు వెచ్చించి ఆలయ రూపంలో మండపాన్ని నిర్మించి, అందులో తెలంగాణ తల్లిని నెలకొల్పి ప్రత్యేక రాష్ట్ర కాంక్షను చాటారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని 15 సెప్టెంబరు 2010న ఉద్యమ నాయకుడు కేసీఆర్ ఆవిష్కరించారు. పల్పనూర్ గ్రామానికి చెందిన దప్పు గోపాల్, ఎండీ సలీం, దేవులపల్లి గ్రామానికి చెందిన పుట్టి ఇంద్రశేఖర్‌రెడ్డి, కొన్యాల గ్రామానికి చెందిన భట్టు మారుతి రాజు, చెన్న నర్సింలు తెలంగాణ తల్లి మండపం నీడలో కూర్చొని ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. నాలుగురోజులైనా అప్పటి ప్రభుత్వం దిగిరాకపోవడం, వారి ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తూ ఉండడంతో విషయం తెలుసుకున్న ఉద్యమ నాయకుడు కేసీఆర్ దౌల్తాబాద్‌కు చేరుకొని వారికి నచ్చచెప్పి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఇదిలా ఉండగా దప్పు గోపాల్‌ది నిరుపేద కుటుంబం. తాపీ మేస్త్రీగా పని చేస్తూ ఇటీవల అనారోగ్యానికి గురై మంచం పట్టాడు. ఉన్న పూరి గుడిసె కూలిపోవడంతో అద్దె ఇంటిలో ఉంటూ ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాడు. భట్టు మారుతిరాజుపై అప్పట్లో పెట్టిన పోలీసు కేసులతో అనేక అవస్థలు పడుతున్నాడు. ఉద్యమానికి ముందులాగానే ఆటో నడుపుతూ జీవనం గడుపుతున్నాడు. చెన్న నర్సింలు ఎంపీటీసీగా గెలుపొంది, ఎంపీపీ ఉపాధ్యక్షుడిగా పని చేశాడు.



అమరణ నిరాహార దీక్షలో పాల్గొన్న గోపాల్, మారుతిరాజు, చెన్న నర్సింలు



మెదక్‌లోని కట్టకింద ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. పలుచోట్ల భక్తులు, హనుమాన్ మాలధారులు, హైందవసంఘాల ఆధ్వర్యంలో ఆంజనేయుడి చిత్రపటాలు, విగ్రహాలతో శోభాయాత్రలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలతో పాటు అన్నప్రసాద వితరణ చేపట్టారు.



శివ్వంపేట: చాకరిమెట్లలో ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక అలంకారం



తూప్రాన్ పట్టణంలోని గీతామందిరంలో పూజలు



కొల్చారం: రంగంపేటలో అభిషేకం నిర్వహిస్తున్న మాధవానంద సరస్వతి



పటాన్‌చెరులోని హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పూజలు

మెదక్ అర్బన్, జూన్ 1: మెదక్ జిల్లా కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలోని అంజనేయస్వామి ఆలయం, పట్టణ శివారులోని పంచముఖి, కుమ్మరిగడ్డ, చమన్, మల్లెంచెరవు, పిల్లికోటాల్, మిలట్రీకాలనీ హనుమాన్ ఆలయాల్లో హనుమాన్ జయంతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం హనుమాన్ విగ్రహానికి చందనపు పూజ, పాదుకాపూజా, అష్టోత్తర శతనామావళి, అభిషేకాలు, హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. మెదక్ పట్టణంలో పలు ఆలయాల్లో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ పాల్గొన్నారు.

● **శివ్వంపేట:** మండల పరిధిలోని చిన్న గొట్టిముక్కల గ్రామంలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయ స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి స్వామివారికి మన్యుసూక్తంతో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆంజనేయ శర్మ, ఈవో సారా శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

● **తూప్రాన్:** తూప్రాన్ లోని పెద్దచెరువు కట్టపై వెలసిన శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, గీతామందిరంలో శ్రీపంచముఖ హనుమాన్ ఆలయం, మండలం ఇస్లాంపూర్ గుట్టపై వెలసిన శ్రీఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను నిర్వహించారు.

● **చిన్నశంకరంపేట:** చిన్నశంకరంపేటలోని హనుమాన్ ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

● **రేగోడు:** రేగోడు గోకర్ణేశ్వర, వీర హనుమాన్ మందిరంలో పూజారి మహేశ్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం రేగోడు వీధులలో బైక్‌లతో ఊరేగింపు నిర్వహించారు.

● **నర్సాపూర్:** నర్సాపర్‌పట్టణంలోని బస్టాండు సమీపంలో ఉన్న అంజనేయస్వామి ఆలయంలో పురోహితులు హరిప్రసాద్‌శర్మ నేతృత్వంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పెద్దచింతకుంట సమీపంలోని జలహనుమాన్ ఆలయంలో స్వామి వారికి పూజలు నిర్వహించారు.

● **కౌడిపల్లి:** మండలంలోని వెల్మకన్నెలోని బాల వీరహనుమాన్ ఆలయంలో పురోహితుడు మెట్టురాములు శర్మ అధ్వర్యంలో పూజ , చందన లేపన కార్యక్రమం నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు.

● **కొల్చారం:** మండలంలోని రంగంపేట, సంగాయిపేట గ్రామాల్లో ఉన్న హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రంగంపేటలోని హనుమాన్ ఆలయంలో రంగంపేట ఆశ్రమపీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామిజీ అభిషేకం నిర్వహిం చారు.

● **పటాన్‌చెరు:** పటాన్‌చెరు, బీరంగూడ, ఇంద్రేశం, అమీన్‌పూర్ తదితర ప్రాంతాల్లోని హనుమాన్ మందిరాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని శాంతినగర్ ప్రసన్నాంజనేయ ఆలయం, జేపీ కాలనీ పంచముఖీ హనుమాన్ ఆలయాల్లో భక్తుల పూజలతో సందడిగా మారింది. పలు ఆలయాల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం అన్నప్రసాదాన్ని వితరణ చేపట్టారు.

● **గుమ్మడిదల:** మండలకేంద్రంతో పాటు బొంతపల్లి, కానుకుంట గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బొంతపల్లి గ్రామంలో వివిధ పార్టీ నాయకులు కలిసి వీరభద్ర స్వామి ఆలయ ఆవరణ నుంచి ర్యాలీ నిర్వహించారు.

● **నారాయణఖేడ్:** మండలంలోని చారిత్రాత్మకమైన కొండాపూర్ హనుమాన్ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నారాయణఖేడ్ ప్రాంతం భక్తులే కాకుండా కామారెడ్డితో పాటు కర్ణాటకలోని బీదర్ జిల్లా భక్తులు కూడా దర్శనం కోసం తరలివచ్చారు. ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్ అనుగ్రహభాషణం చేశారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి



సరిత(ఫైల్)

రామాయంపేట, జూన్ 1: అత్తింటి వేధింపులతో వివాహిత బలైన ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలో శనివారం వెలుగు చూసింది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా రాయపోల్ గ్రామానికి చెందిన కరుణాకర్‌తో మెదక్ జిల్లా చేగుంట మండలం కరీంనగర్ గ్రామానికి చెందిన సరిత(30) వివాహం రెండేళ్ల క్రితం జరిగింది. ఆమెకు ఏడాది బాబు ఉన్నారు. అయితే తరచూ అత్త, భర్తతో ఇంట్లో గొడవల మూలంగా ఆమె తీవ్ర మనస్తాపానికి గురైంది. దీంతో మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన సరిత శనివారం ఉదయం తన అమ్మమ్మ గారి ఊరు అయిన ధర్మారం పెద్ద చెరువులో తేలియాడుతూ మృతదేహం కనిపించింది. ఈ సమాచారమందుకున్న మృతురాలి తల్లి రాజమని, బంధువులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తన కూతురిని చంపి చెరువులో పడేశారంటూ తల్లి రాజమణి ఆరోపించింది. అత్తింటి వారు వచ్చే వరకు మృతదేహాన్ని తీయొద్దంటూ ఎండలో గంటల పాటు ఆందోళన చేపట్టారు. ఎస్‌ఐ రంజిత్ వారిని సముదాయించి ఆందోళన విరమింపజేశారు.

బొల్లారం కుడికుంటలో శిశువు మృతదేహం

జిన్నారం, జూన్ 1: మండలంలోని బొల్లారం కుడికుంటలో అప్పుడే పుట్టిన శిశువు మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. కుడికుంటలో కుళ్లిన స్థితిలో ఉన్న శిశువు మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా శిశువు మృతదేహాన్ని శనివారం సాయంత్రం గుర్తించగా శుక్రవారం రాత్రి పారవేసి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు.

సౌత్‌ఆఫ్రికాలో శివ్వంపేటవాసి మృతి



కీర్తితేజ (ఫైల్)

శివ్వంపేట, జూన్ 1 : వ్యాపారం నిమిత్తం సౌత్ ఆఫ్రికాలో నివసిస్తున్న వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకున్నది. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికుల వివరాల మేరకు.. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన నర్సాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గరికపాటి రామచంద్ర ప్రసాద్ చిన్నకుమారుడు గరికపాటి కీర్తితేజ(42) వ్యాపారం నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి సౌత్ ఆఫ్రికాలోని రువాండాలో నివసిస్తున్నాడు. శనివారం గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందాడు. కీర్తితేజ మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కీర్తితేజ మృతిపట్ల పలువురు వ్యాపారవేత్తలు, ప్రముఖ రాజకీయ నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

ఎంపీఎల్ పరిశ్రమలో కార్మికుడు..



మృతి చెందిన అజయ్‌కుమార్ రౌత్

మనోహరాబాద్, జూన్ 1: కాళ్లకల్ గ్రామ శివారులోని ఎంపీఎల్ పరిశ్రమలో ఒడిస్సా రాష్ట్రానికి చెందిన కార్మికుడు మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కరుణాకరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రం నింపాడ గ్రామానికి చెందిన అజయ్‌కుమార్ రౌత్ (46) గత ఐదేళ్లగా మనోహరాబాద్ మండలం లోని కాళ్లకల్ గ్రామా శివారులోని ఎంపీఎల్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. శనివారం ఉదయం పరిశ్రమలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో డీసీఎంలో లోడ్ చేస్తున్న పైపులు అతడి మీదపడి తీవ్ర గాయాలయ్యాయి. పరిశ్రమ యంత్రాంగం మేడ్చెల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుతిపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అక్కడే చనిపోయాడు. మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వెల్దుర్తి, జూన్ 1: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదును దోచుకెళ్లారు. ఎస్‌ఐ నవతాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శేరి గ్రామానికి చెందిన వడ్డెర కిష్టయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. శనివారం తిరిగి వచ్చేసరికి ఇంటికి వేసిన తాళం ధ్వంసమై ఉంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉన్న 7 గ్రాముల బంగారపు వస్తువులు, రూ. 2.50 లక్షల నగదు చోరీకి గురైనట్లు గ్రహించారు. కాగా అదే గ్రామానికి చెందిన ముగ్గురిపై అనుమానం వుందని బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి తూప్రాన్ సీఐ కృష్ణ, ఎస్‌ఐ నవతగౌడ్‌లు చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

శివ్వంపేట, జూన్ 1: ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు నిర్వహిస్తూ ఇటుక బట్టీలకు తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. ఎస్‌ఐ మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొత్తపేట రూప్లా తండాలో మాలోత్ కిషన్ నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారమందింది. వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మూడు ట్రాక్టర్లను స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు

చిలప్‌చెడ్, జూన్ 1: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ పై కేసు నమోదైంది. శనివారం ఎస్‌ఐ షేక్ మహబూబ్ మాట్లాడుతూ.. శుక్రవారం రాత్రి పోలీసు సిబ్బంది పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో చిట్కుల్ శివారులో ఇసుకను అక్రమంగా రవాణాచేస్తున్న నెంబరు లేని ట్రాక్టర్‌ను సిబ్బంది పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ట్రాక్టర్ ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా ఎడ్ల బండ్ల ఊరేగింపు

ఝరాసంగం, జూన్ 1: ఎల్గోయి గ్రామంలో ఈదమ్మ గ్రామ దేవత జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం గ్రామస్థులు ఎడ్లబండ్ల ఊరేగింపు చేపట్టారు. తెల్లవారుజామున నుంచి గ్రామ దేవతకు మహిళలు అభిషేక కార్యక్రమాలను చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ రంగు రంగు పూలతో ఎడ్ల బండ్లను అలంకరించి డప్పుచప్పుళ్ల, కళాకారుల నృత్యాల మధ్య ఊరేగింపుగా ఆలయం చుట్టు ప్రదక్షిణాలు చేశారు. సాయంత్రం మహిళలు బోనాలను అమ్మవారికి సమర్పించుకొన్నారు.

ఉత్సవాలను జయప్రదం చేయండి

● ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, జూన్ 1 రాష్ట్ర అవిర్భావ ఉత్సవాలను జూన్ 1వ తేదీ నుంచి 3 వరకు జిల్లాలో ఘనంగా నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు.

రెండు రోజుల్లో సోక్‌ఫిట్ పనులు పూర్తి చేయాలి: డీపీవో

కొల్చారం, జూన్ 1: కొల్చారం మండలం పోతంశెట్‌పల్లి చౌరస్తా, అప్పాజిపల్లిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య శనివారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య పోతంశెట్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని క్రాస్‌రోడ్డు ప్రైమరీ స్కూల్ నందు సోక్‌ఫిట్ నిర్మాణ పనులను, నర్సరీలో మొక్కల పెంపకం పనులను పరిశీలించారు. రెండు రోజుల్లో సోక్‌ఫిట్ పనులు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి అరుంధతిని ఆదేశించారు. అలాగే అప్పాజిపల్లి గ్రామ పంచాయతీలో పల్లె ప్రకృతి వనం పనులను, నర్సరీలో మొక్కల పెంపకం గురించి పంచాయతీ కార్యదర్శి ఫణీంద్రను అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా శ్రీనివాస కల్యాణం

మెదక్ అర్బన్, జూన్ 1: జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి 34వ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీనివాసపద్మావతి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పల్లకిలో పుర వీధుల్లో ఊరేగించారు.

పాడిపరిశ్రమపై రైతులు దృష్టి సారించాలి



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రతినిధులు

జహీరాబాద్, జూన్ 1: మార్కెట్లో పాలఉత్పత్తులకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో రైతులు పాడి పరిశ్రమరంగం వైపు దృష్టిసారించాలని వ్యవసాయ పరిశోధనామండలి ప్రధాన శాస్త్రవేత్త డా.అరవింద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అల్గోల్ శివారులో గల డీడీఎస్-కేవీకే (డెక్కన్ డెవలప్‌మెంట్‌సొసైటీ- కృషివిజ్ఞాన కేంద్రం)లో స్వర్ణోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేవీకేలను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. రైతులు మాత్రం చిరుధాన్యాలు, తదితర పంటలతో పాటు కొంతవరకైనా పాడిపరిశ్రమను కొనసాగించాలన్నారు. అనంతరం సీనియర్ శాస్త్రవేత్త వరప్రసాద్ మాట్లాడుతూ జహీరాబాద్ సమీపంలో గల కేవీకే 50 సంవత్సరాలు పూర్తి చేసుకొని స్వర్ణోత్సవాలు చేసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అలాగే జూన్ 1న పాల ఉత్పత్తి దినోత్సవం కావడంతో పాల ప్రాముఖ్యతను కూడా సమావేశంలో రైతులకు వివరిం చారు. కేవీకేలో 2,518మంది రైతుల పొలాల్లో భూసారపరీక్షలు చేసి సర్టిఫికెట్లను అందజేయడాన్ని అభినందించారు. అనంతరం కేవీకేలో చేపట్టిన పలుకార్యక్రమాలకు సంబంధించి బ్రోచర్‌ను విడుదల చేశారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి: కలెక్టర్



ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నిజాంపేట, జూన్ 1: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేశామని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక సబ్ మార్కెట్‌యార్డులో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించి ధాన్యం బస్తాలను, తేమశాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 2 లక్షల 69 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. మండలంలోని రెండు కేంద్రాల్లో ధాన్యం ఇంకా ఉన్నదని, రేపటిలోగా పూర్తి చేయాలని నిర్వాహకులకు తెలిపారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో రాజిరెడ్డి, వ్యవసాయ అధికారి రాజ్ నారాయణ, ఆర్ ఐ గంగాధర్ గౌడ్, సీఈఓ శోభారాణి, పీఏసీఎస్ చైర్మన్ బాపురెడ్డి, కార్యదర్శి నర్సింహులు ఉన్నారు.



ఖైదీలకు ఇచ్చే ఆహారాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి

ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు

● జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర

కంది, జూన్ 1 : జిల్లా న్యాయసేవాధికార సంస్థలో అర్జీ పెట్టుకున్న ఖైదీలకు ఉచిత న్యాయసేవలు అందిస్తామని జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర పేర్కొన్నారు. కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలును శనివారం ఆమె తనిఖీ చేశారు. జైలులోని అన్ని బ్లాకులను, ఖైదీల బ్యారక్‌లు, గదులు, వంటశాల, బాత్‌రూమ్‌లతో పాటు జైలు ఆవరణను పరిశీలించారు. జైలులో ఖైదీలకు అందుతున్న భోజనాన్ని రుచి చూశారు. వారికి కల్పిస్తున్న సదుపాయాలను జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందించే ఆహారం నాణ్యంగా ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ సమయానికి బెయిల్, ములాఖత్ అందుతున్నాయా అని ఆరా తీశారు. స్వయంగా న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేనివారు జిల్లా న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఖైదీలు ఉచిత న్యాయసేవలు పొందేందుకు వారి తరఫున న్యాయవాదులను నియమిస్తామన్నారు. వెంట జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.రమేష్, ట్రెయినీ జడ్జిలు ధనలక్ష్మి, కృష్ణతేజ, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్స్ దేవదాస్, రత్నాకర్, బాబు, వెన్నెల, జైలు సూపరింటెండెంట్ దండా భరత్‌రెడ్డి ఉన్నారు.

అందరికి ఉపాధిపనులు కల్పించాలి

● ఉపాధిహామీ అడిషనల్ పీడీ బాల్‌రాజ్

జహీరాబాద్, జూన్ 1: గ్రామాల్లో అర్హులైన కూలీలందరికి ఉపాధిహామీ పథకంలో పనులను కల్పించేలా చూడాలని ఉపాధిహామీ అడిషనల్ పీడీ బాల్‌రాజ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 2023-24 సంవత్సరానికి గానూ మండలంలోని ఆయా గ్రామాల్లో రూ.5.64కోట్ల వ్యయంతో చేపట్టిన పనులకు సంబంధించి ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పనులను కొనసాగించాలన్నారు. శనివారం చేపట్టిన ప్రజావేదికలో అక్కడక్కడ జరిగిన పొరపాట్లను సరిచేసుకోవాలని, చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. పనులను చేపట్టే ప్రదేశంలో ఏమైనా సందేహాలుంటే సంబంధిత అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాధవరెడ్డి, ఏపీవో అశోక్‌కుమార్, ఆయా శాఖలకు చెందిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

● ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు

నారాయణఖేడ్, జూన్ 1: పట్టణంలో శనివారం ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆర్డీవో అశోక చక్రవర్తి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయాధికారి శంకర్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎట్టణంలోని అన్నదాత ఫర్టిలైజర్ దుకాణంలో విత్తనాల స్టాకు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసిన రైతులకు కచ్చితంగా రసీదులు ఇవ్వాలన్నారు. ఎవరైనా వ్యాపారులు నకిలీ విత్తనాలను, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మనూరులోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని కూడా ఆర్డీవో తనిఖీ చేసి, కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీసీఎంఎస్ సూపర్ వైజర్ స్వప్నకు సూచించారు. ఆయన వెంట మనూరు తహసీల్దార్ వెంకటస్వామి, ఆర్‌ఐ.శంకర్‌రెడ్డి, ఏఎస్‌ఐ శ్రీనివాస్, ఏఈవో సంగమేష్ తదితరులు ఉన్నారు.

● **జహీరాబాద్:** పట్టణంలోని సుభాష్‌గంజ్‌లో పలు ఎరువుల, విత్తనాల దుకాణాలను శనివారం జహీరాబాద్ తహసీల్దార్ రవీందర్ తనఖీ చేశారు. ఆయా దుకాణాల్లో ఉన్న స్టాక్, క్రయ, విక్రయాల రిజిస్టర్లను పరిశీలించారు. వెంట వ్యవసాయశాఖ అధికారులు, పోలీసులు ఉన్నారు.

● **గుమ్మడిదల:** మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో వ్యవసాయశాఖ, పోలీసు అధికారులు సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు, ఎస్‌ఐ మహేష్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

● **మనూరు:** మనూరులో శనివారం ఎరువులు, విత్తనాల దుకాణాలను మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌ఐ ఆమ్మ్యానాయక్ తనిఖీ చేశారు.

● **నాగల్‌గిద్ద:** కల్తీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని నాగల్‌గిద్ద తహసీల్దార్ షబనాబీ అన్నారు. శనివారం నాగల్‌గిద్ద మండల కేంద్రంలో పలు ఫర్టిలైజర్ దుకాణాలను సందర్శించి తనిఖీ చేశారు. వెంట ఏవో వెంకటేశం, ఏఎస్‌ఐ అంజిరెడ్డి, డీలర్లు ఉన్నారు.

● **ఝరాసంగం:** ఝరాసంగంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం తహసీల్దార్ సంజీవరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ధరలు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేషం, తదితరులు ఉన్నారు.

● **కంగ్టి:** మండల కేంద్రంలో శనివారం పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో స్టాకును, రికార్డులను పరిశీలించారు. రైతులు కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. తనిఖీల్లో వ్యవసాయాధికారి ప్రవీణ్‌చారి, ఎమ్మార్వో విష్ణుసాగర్, ఏఎస్‌ఐ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● **చిన్నశంకరంపేట:** మండల కేంద్రంలోని ఆగ్రోస్, ఫర్టిలైజర్ షాపులను శనివారం ఏవో ప్రవీణ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

'పది' సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

మెదక్ అర్బన్, జూన్ 1: జూన్ 3 నుంచి 11వ తేదీ వరకు జరిగే పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే పరీక్షలకు 783 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు. జనరల్ సైన్స్ పరీక్ష రెండు రోజులు ఉంటుందని, 8న పార్ట్-1 ఫిజికల్ సైన్స్ ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు, 10న పార్ట్-11 జీవశాస్త్రం పరీక్ష జరుగుతుందన్నారు. 5 నిమిషాలు దాటితే లోనికి అనుమతి లేదన్నారు.

ఇంటింటికీ డీసీసీబీ సేవలు

● డిపాజిట్ల సేకరణపై ప్రత్యేక కార్యక్రమం

● 'బచ్‌పన్ భరోసా' కరపత్రాల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న, ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, సీఈవో శ్రీనివాస్

సంగారెడ్డి టౌన్, జూన్ 1 : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) సేవలను మరింత విస్తరించాలన్న ఉద్దేశంతో ఈసారి కొత్తగా 'ఇంటింటికీ డీసీసీబీ సేవలు' కార్యక్రమాన్ని చేపట్టామని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డిలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం డీసీసీబీ ఖాతాదారులతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకుని, బ్యాంకు ద్వారా చేపడుతున్న పలు పథకాల గురించి వివరించారు. చిన్న పిల్లలకు పొదుపుపై ఆసక్తి పెంచేలా కొత్తగా డిపాజిట్ పథకాన్ని రూపొందించామన్నారు. సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకాన్ని చిన్నారుల కోసం ప్రత్యేకంగా అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని జిల్లాలో ఏడాది పాటు నిర్వహించి బ్యాంకు సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ డిపాజిట్లు సేకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో శ్రీనివాస్, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● **సంగారెడ్డి రూరల్:** ఇంటింటికి డీసీసీబీ డిపాజిట్ సేకరణ మాసోత్సవం నిర్వహిస్తున్నట్టు పోతిరెడ్డిపల్లి బ్రాంచ్ మేనేజర్ స్రవంతి తెలిపారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని డీసీసీ బ్యాంకులో శనివారం డిపాజిట్ మాసోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. సెర్ప్ ఏపీఎం వెంకట్, టీజీవో అధ్యక్షుడు వైద్యనాథ్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

● **పటాన్‌చెరు:** ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఇంటింటికి డీసీసీబీ బ్యాంకు పేరుతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బ్యాంక్ డైరెక్టర్ పి.రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం పటాన్‌చెరు డీసీసీ బ్యాంకులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏజీఎం కృష్ణలత, సిబ్బందితో కలిసి ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ అశ్విని, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

● **హత్నూర:** సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ కార్యక్రమం ఆర్థికంగా ఎంతో మేలు చేకూర్చుతుందని డీసీసీబీ దౌల్తాబాద్ బ్రాంచ్ మేనేజర్ ప్రవళిక తెలిపారు. శనివారం దౌల్తాబాద్ డీసీసీబీ బ్రాంచ్ బచ్‌పన్ భరోసా పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో కాసాల పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ వినయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **గుమ్మడిదల:** మండల కేంద్రంలో శనివారం డీసీసీబీ బ్యాంక్ గుమ్మడిదల నూతనంగా సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకాన్ని స్థానిక నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంద్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, మాజి సర్పంచ్ నర్సింహారెడ్డి, మేనేజర్ లలిత, సిబ్బందిపాల్గొన్నారు.

● **కల్హేర్:** సిర్గాపూర్ డీసీసీ బ్యాంకులో శనివారం సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకాన్ని ప్రారంభించారు. ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాములు, సిర్గాపూర్ బ్యాంకు మేనేజర్ రవికుమార్, సిర్గాపూర్ ఎంపీటీసీ పీరప్ప, ఐకేపీ ఏపీఎం చంద్రశేఖర్, సీసీలు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

● **నారాయణఖేడ్:** నారాయణఖేడ్ బ్యాంకు ఆవరణలో డీసీసీబీ డైరెక్టర్ వెంకట్‌రాములు, బ్యాంకు మేనేజర్ వెంకటేష్‌తో కలిసి ఇంటింటికీ డీసీసీ బ్యాంకు సేవల వాల్‌పోస్టర్‌ను జిల్లా సహకార కేంద్రబ్యాంకు డీజీఎం ఎం.సర్వేశ్వర్‌రావు ఆవిష్కరించారు. అనంతరం ఐకేపీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా బ్యాంకు రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. పదేళ్ల లోపువారి కోసం సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకాన్ని కొత్తగా తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలోఐకేపీ ఏపీఎంలు , సిబ్బంది పాల్గొన్నారు.

● **చేగుంట:** జిల్లా సహకార బ్యాంక్ ప్రవేశపెట్టిన సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకం సద్వినియోగం చేసుకోవాలని చేగుంట డీసీసీ బ్యాంక్ మేనేజర్ శశికాంత్ రెడ్డి అన్నారు. ఇంటింటికీ డీసిసి బ్యాంక్ డిపాజిట్ సేకరణ మాసోత్సవంలో భాగంగా మండల పరిధిలోని చేగుంట, రెడ్డిపల్లి, ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మెన్లు, డైరెక్టర్లు, బ్యాంక్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు మేకల పరమేష్, కొండల్ రెడ్డి, కుమ్మరి రాములు, డీసీసీ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ కాజోల్, అసిస్టెంట్ మేనేజర్ స్వాతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **పెద్దశంకరంపేట:** పెద్దశంకరంపేటలోని డీసీసీబీ బ్యాంకులో ఇంటింటికీ డీసీసీబీ సేవల కార్యక్రమం డిపాజిట్ల సేకరణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, డీసీసీ బ్యాంకు మేనేజర్ కలిమొద్దీన్, బ్యాంకు సిబ్బంది ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.